# పొద్దుతిరుగుడు పువ్వు

-ముదిగొండ శివకౌముదీదేవి

రచయితలు కూడా సమాజంలో మనుష్యులే. వాళ్ళకీ వ్యక్తిగత రాగద్వేషాలుంటాయి. ఎక్కడో ఒక చోట ఏ ఒక్కరో మినహాయిస్తే వాళ్ళు మానవ స్వభావానికి అతీతంగా ప్రవర్తించాలని అనుకోవటం అత్యాశే అవుతుంది. ఈ విషయం ఎందుకు చెప్ప వచ్చానంటే సమాజంలో చూసిన ప్రతిదీ కథలోకి ఎక్కించి నలుగురి దృష్టికీ తేవాలనుకోవడం సరికాదు. అసలు అందరమూ అట్లా చేయం.

కాని ఒక్కోసారి, కొన్ని విషయాలు అందరూ తెలుసుకోతగినవి ఉంటాయి. అటువంటి విషయం ఒకటి ఉండడం వల్లనే ఈ కథ వ్రాస్తున్నాను. కాని లేకపోతే వ్రాయక పోదును. ఎందుకంటే డా. విద్యాలక్ష్మి నాకెంతో ఆప్తురాలు. మంచి మిత్రురాలు. ఆమె గురించి "ఇట్లా సుమా" అని నలుగురికీ చెప్పడం నాకు ఇష్టం కాదు.

అయినా ఇక్కడ మనం గమనించవలసినదేమిటంటే ఎంతో చదువుకున్న వాళ్ళు, పరిణతి చెందిన వ్యక్తులని మనం అనుకున్నవారు, మంచివారు, మూర్తీభవించిన ఆప్యాయత అనతగిన వారు; ఒక్కోసారి తమ జీవితాలలో ఎంతో చిత్రంగా, ఆశ్చర్యకరంగా, చెప్పనలవి కాకుండా ప్రవర్తిస్తుంటారు. అటువంటి ఒక అవగాహనాలోపం, ఒక అహంకారం గురించిన కథ ఇది.

డా. విద్యాలక్ష్మి అంటే మెడికల్ డాక్టర్ కాదు.

తెలుగు సాహిత్యంలో డాక్టరేటు.

నేను (డా. సరస్వతి). తను బాల్యం నుండి క్లాస్‌మేట్స్ం.

హైదరాబాద్‌లోనే స్కూలు నుండి డాక్టరేటు దాకా.

విద్యాలక్ష్మి డాక్టరేటు పూర్తయి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా చేరి ఇప్పుడు ప్రొఫెసర్ అయింది. నేను పత్రికా రంగంలో పని చేస్తూ, ప్రస్తుతం ఒక దినపత్రికలో మహిళా పేజీ-ఇన్-ఛార్జిగా ఉన్నాను. అప్పుడప్పుడూ కథలూ, కవిత్వమూ వ్రాస్తుంటాను.

నేనూ, విద్యాలక్ష్మీ తరుచూ సభల్లో సాహిత్యం గురించి, మహిళా విషయాల గురించీ మాట్లాడుతుంటాం.

ఇవాళ ఈ వరండాలో కుర్చీ వేసుకుని కూర్చుని, దూరంగా గింజలు ఏరుకుంటున్న పిచ్చికలను చూస్తూ, నీలాకాశంలో తేలే మబ్బుల్నీ, గాలికి ఊగే గడ్డినీ, మా ఇంటి ముందున్న చిన్నతోటలో ఆడుకుంటున్న ఉడతల్నీ, ఎగిరే సీతాకోక చిలుకల్నీ చూస్తూ తీరిగ్గా ఆలోచిస్తుంటే నాకనిపిస్తోంది - విద్యాలక్ష్మికి ఈ లక్షణం చిన్నప్పటి నుంచీ ఉండేది. శారద చెప్పిన ఈ స్వభావం తనకి ఎప్పటినుంచో సహజం. తనెప్పుడూ క్షణం వృథా చేయదు. కాలక్షేపం చేయదు. అది సరే - తనకి తనే ఎప్పుడూ ఫస్ట్ ప్లేస్‌లో ఉండాలి అన్నింటా - అనే తాపత్రయం బాల్యం నుంచి ఉండేది.

అసలు విద్య తెలుగమ్మాయి కాదు.

వాళ్ళ నాన్న బెంగాలీ! తల్లి రష్యన్.

వాళ్ళ తాతగారు బెంగాలీలో పండితుడు.

వాళ్ళమ్మ, నాన్న ఇద్దరూ ఇంగ్లీషు లెక్చరర్లు.

వాళ్ళ అమ్మ తండ్రికి దౌత్య విభాగంలో పని కావడంతో వాళ్ళు ఇండియా వచ్చారు. విద్య తల్లిదండ్రులు క్లాస్‌మేట్స్. ఆ విధంగా ఇష్టపడి వివాహం చేసుకున్నారు. విద్య పుట్టాకే వాళ్ళ నాన్నకి హైదరాబాద్ సీఫెల్‌లో ఉద్యోగం వచ్చింది. విద్య వాళ్ళ అమ్మ వేషభాషలు పూర్తి భారతీయంగా ఉండడం వల్ల ఆమె రష్యన్ తెలిసేది కాదు. ఆవిడేదో ఇండియన్ పేరు కూడా పెట్టుకున్నది.

ఆ విధంగా ఇండియన్, రష్యన్ జీన్స్ కలయిక వల్ల విద్యకి కళల్లో అభిరుచి అధికం. ఆమె బాల్యం నుండే సాహిత్యం, సంగీతం, నాట్యం, చిత్రలేఖనం వీటన్నింటిలోనూ విశేష ప్రతిభ కనపరిచేది. విద్య కర్ణాటక సంగీతంతో పాటు హిందుస్థానీ కూడా నేర్చుకున్నది.

కొన్నాళ్ళు కలకత్తా వెళ్ళి రవీంద్ర సంగీతం నేర్చుకుంది. వీణ వాయించేది.

విద్య పాడుతుంటే ఏ కొండలపై నుంచో తేలివచ్చే గాలి వలే మృదువుగా, ఏ లోయలోని పారిజాత పూలతోటల లోనో పరిమళాలు అందుకున్న గాలి స్పర్శవలే ఉండేది.

నిజానికి విద్యకి లలిత సంగీతం అంటే మిక్కిలి మక్కువ. ఆమె గానం ఒకసారి మీ ఆత్మను జోకొట్టి నిద్ర పుచ్చేదిగా, మరోసారి మీ అంతరంగంలో నిదురించిన భావోద్వేగాలను కదిలించేదిగాను ఉండేది - రావు బాలసరస్వతి పాట వలే.

ఎంత కఠినులనైనా కదిలించి, వారి అంతరంగంలో ఆర్ద్రతను సృజించే గుణం - ఒక ఓషధీగుణం వంటి ఆ సుగుణం - అది విద్య పాటలోను ఉండేది.

పరమ దుర్మార్గుల్లో కూడా సద్గుణాలను రేకెత్తించేది ఆమె పాట (అదే కదా ఆర్.బాలసరస్వతి ప్రత్యేకత కూడ)

అసలు తొలినాటి గాయకులందరి ఈ ప్రత్యేకత ఉండేది. కె.ఎల్.సైగల్, సి.హెచ్.ఆత్మా, హేమంత్ కుమార్, రామచంద్ర చితోడ్‌కర్, దక్షిణాదిన ఏ.ఎం.రాజా ఆ కోవకు చెందిన వారు. విద్య కూడా ఆ వరుసలో చేర్చతగిన గాయని.

విద్య పూర్తి పేరు విద్యాలక్ష్మి ముఖర్జీ.

ఆమె సార్థక నామధేయురాలు. తెలుగుతోపాటు డేన్స్‌లోనూ సంగీతంలోనూ ఎం.ఏలు చేసింది. తను బి.ఏలో ఉండగానే భారతి సాహిత్య పత్రికలో వ్యాసాలు రాసింది. తర్వాత అనేక పత్రికల్లో సంగీతం, వ్యాసాలు వ్రాసేది. ఆకాశవాణి, దూరదర్శన్‌లకు పనిచేయడం, పత్రికల్లో పుస్తక సమీక్షలు చేయడం ద్వారా ఆమె పాఠకులకు, శ్రోతలకు, ప్రేక్షకులకు సుపరిచిత అయింది. తర్వాత ఆమె కాలమిస్టు అయింది. ఫెమినిజం, సంగీతం, సినిమాలు, సామాజిక విషయాలు వీటన్నింటి గురించి కాలమ్స్ - పత్రికల్లో, ఇంటర్ నెట్‌లో కూడా రాసింది. ఆమెకి బాగా ప్రఖ్యాతి లభించింది.

విద్యకి చదువంటే అమిత ఇష్టం.

ప్రొఫెసర్ అయ్యాక కూడా ఇంకో యూనివర్సిటీలో ఎం.ఏ. చదువుతోందంటే ఆమెకి ఎంత జిజ్ఞాసో తెలియడం లేదూ?

ఆమెకి మంచి సృజన ఉన్నది.

ఆమె జీవిత విధానం. నగర నివాసం, మానవ సంబంధాలు, ఇట్లా ఒనగూడిన అనేక పరిస్థితుల వల్ల ఆమె తెలివి, చదువు, జిజ్ఞాస రాణింపు నొచ్చాయి. అదీ అసలు అదృష్టం!!

ఇక విద్య వ్యక్తిగత జీవితం గురించి.

ఆమె బిఏలో ఉండగా భాస్కరరావు అనే తెలుగు వాడిని ప్రేమించింది.

భాస్కరరావు వాళ్ళది పేరు, డబ్బు, పలుకుబడి, ఆస్తి ఉన్న పరమ ఛాందస నియోగి కుటుంబం.

అతని తండ్రి ఈ సగం విదేశీ పిల్లని చేసుకోవడానికి అంగీకరించలేదు.

ఇటు విద్య ఇంట్లోనూ అడ్డంకులు - పట్టుదలలు.

చివరికి ఊరిబయట గుడిలో పెళ్ళి జరిగింది. తర్వాత రిజిస్టర్ ఆఫీసులో కూడా.

ఇద్దరికీ ఉద్యోగం లేకుండా అంత త్వరపడి పెళ్ళెందుకు చేసుకున్నారా? అని నేనూ ఆశ్చర్యపోయాను.

ఎందుకంటే నేనూ, విద్యా చాలా దగ్గర స్నేహితులం - మా మధ్య రహస్యాలేం లేవు.

అయినా విద్య నాతో కొన్ని విషయాలు చెప్పకుండా దాచిందని నాకు తర్వాత తెలిసింది.

ఎంతదగ్గర స్నేహితులకైనా చెప్పకూడని రహస్యాలుంటాయి ప్రేమికులకి - అని ఈ విషయం ద్వారా నేను మొదటిసారిగా తెలుసుకున్నాను. విషయం ఏమిటంటే ఆ పెళ్ళి జరిగే నాటికే ఆమె గర్భవతి!!!

ఆ తర్వాత విజయవాడ వెళ్ళి అక్కడ ఉండి, పాపని కని అక్కడ అనాథ శరణాలయంలో వదిలేసి వచ్చింది. (తర్వాతెప్పుడో నాతో చెప్పింది - ఆ పాప చాలా అందంగా పుట్టినప్పుడు తామర పువ్వు, చందమామ కలిసినట్లు ఉందని చాలా బుద్ధిమంతురాలు అక్కడ వాళ్ళ చుట్టాల ఇంట్లో పెరుగుతోందని, క్లాసులో ఫస్టు అని, బాగా పాడుతుంది కాని సంగీతం చెప్పించడం లేదని. ఆ పాప దేవీకృపతో పుట్టిన వరపుత్రిక వంటిది - అని కూడా చెప్పింది.)

తర్వాత పెద్దవాళ్ళే విద్యాలక్ష్మి, భాస్కరరావుల పెళ్ళిచేసారు. అంతా సర్దుకుంది.

భాస్కరరావుకి ఐ.ఏ.ఎస్.లో సెలక్షన్ వచ్చింది. అతను ఆంధ్రప్రదేశ్ క్యాడర్ లోనే చేరాడు. వాళ్ళకి ఇద్దరు మగ పిల్లలు, చదువులో, ఆటల్లో చురుకు. ఒకడు మెడిసిన్. ఒకడు ఇంజనీరింగ్ చదువుతున్నారు. వేరే ఊళ్ళో ఉంటారు. ఇద్దరూ టెన్నిస్‌లో, క్రికెట్‌లో చాలా కప్పులు, షీల్డులు సాధించారు. పెద్దవాడు మృదంగం, చిన్నవాడు గిటార్ నేర్చుకుంటున్నారు.

విద్యకి అత్తవారింట్లో ఎంతో మంచి పేరుంది.

విద్య పెళ్ళయి ముప్ఫై సంవత్సరాలు. (ఆ మొదటి గుళ్ళో పెళ్ళి) ఆ మధ్య విద్యాలక్ష్మి కూతురు హైదరాబాద్ వచ్చింది - తొమ్మిదేళ్ళ క్రితం - ఉద్యోగరీత్యా. అప్పటి నుంచీ ఇక్కడే ఉంటోంది.

ఆ అమ్మాయి పేరు శారదా చంద్రిక.

ఏదో తెలుగు దినపత్రికలో విలేకరిగా పని చేసేది.

ఇక్కడ విద్యాలక్ష్మి అందచందాల గురించి చెప్పాలి. సహజంగా బెంగాలీలు అందమైన వారు చాలా

వరకు. ఈ అమ్మాయికి రష్యన్ జీన్స్ కూడా ఉండడం వల్ల ఒక విలక్షణమైన ఎరుపు రంగు వచ్చింది. ఆ రంగులో మెరుపు కూడా ఉండేది. ఆల్చిప్పల వంటి కళ్ళు, కళ్ళలో కాంతులు, విజ్ఞానం, కరుణ విరజిమ్ముతూ విద్య అచ్చం బాపుబొమ్మవలే ఉండేది.

కొద్దిగా ఎర్రగా ఉండే ఉంగరాల జుత్తు, ఆమె ధరిస్తే ఆభరణాలకే అందం రావడం ఆమె ప్రత్యేకత. దాదాపు ఆరడుగుల పొడుగు ఉండడం కూడా ఆమె ప్రత్యేకత.

ఈ శరీర లావణ్యాన్ని మించినది ఆమె ప్రవర్తన. విద్య అత్యంత మర్యాదస్తురాలు అని చెప్పవచ్చు. ఎంతో మృదువుగా పలకరించడం, మర్యాదగా ప్రవర్తించడం ఆమె విశిష్టతలు. సంతూర్ వాద్యం మంద్ర స్థాయిలో మ్రోగుతున్నట్లుండేది ఆమె మాట్లాడితే. ఆమె ప్రక్కన నుంచుంటే ఒక దేవత ప్రక్కన నిల్చున్నట్లుండేది. ఆమెలో జీవితోత్సాహం పొంగి పొరలుతూ ఉండేది.

సాధారణంగా తల్లి అందచందాలు కూతురికి వస్తాయి అంటారు కాని రావాలనేం లేదు.

విద్య కూతురు విద్యంత అందగత్తె కాదు.

ఆ అమ్మాయిలో కొద్దిగా విద్య పోలికలు, కొద్దిగా భాస్కరరావు పోలికలు ఉన్నాయి. కాని అదేమిటో ఆ అమ్మాయి మొహంలో ఎక్కడా నాకు విద్యలో భాస్కరరావులో ఉన్న సౌందర్యం, హాస్యం, చాతుర్యం, ఠీవి, దర్జా కనిపించలేదు.

తండ్రి తెలుగు వాడైనా తల్లి సగం బెంగాలీ, సగం రష్యన్ కావడం వల్ల శారదా చంద్రిక హాలివుడ్ హీరోయిన్‌లాగా ఉండేది. అందులోనూ సాహసాలు, పోరాటాలు చేసే యోధురాలి వలే ఉండేది. బాగా పరికిస్తే ఆ అమ్మాయిలో ఏదో దీనత్వం ఉండేది – అంతర్లీనంగా.

పైకి మాత్రం ఇంగ్లీషు సినిమాల్లో చూపించే మిలటరీ ఆఫీసర్ వలే ఉండేది.

ఆ అమ్మాయిలో ఏదో పెద్దలోపం ఉన్నట్లు నాకు ఆ అమ్మాయిని మొదట చూసినప్పుడే అనిపించింది.

అప్పట్లో ఆ అమ్మాయి క్రొత్తగా పెట్టిన ఒక తెలుగు దిన పత్రికలో విలేఖరిగా శిక్షణలో ఉండేది. వాళ్ళకి క్లాసెస్ చెప్పడానికి సీనియర్ జర్నలిస్టులని పిలిచారు. కొంతకాలం నేనూ వెళ్ళాను.

అప్పట్లోనే విద్య నాతోపాటూ వచ్చింది ఆ క్లాసులకి – తన కూతురుని చూసుకోవడానికి. అప్పుడే నాతో చెప్పింది ఆ అమ్మాయి తన కూతురని.

ఎవరి పోలిక – అనడిగింది.

ఆ అమ్మాయిలో పెద్దగా ఎవరి పోలికా లేదు.

విద్య కొంచెం చిన్నబుచ్చుకుని "పోనీ అందంగా ఉందా? అదైనా చెప్పు" అన్నది నిష్ఠూరంగా.

నేనన్నాను – "ఒక మనిషి అందచందాలని మనం నిర్ణయించేది కేవలం కనుముక్కు తీరు, రంగు, విగ్రహం ఇదే కాదు కదా – ఆ మనిషి ముఖంలో భావంతోనే అందం పూర్తయ్యేది. ఒక మనిషి కళ్ళలోని భావం ఆ మనిషి అందాన్ని నిర్ణయిస్తుంది. నిజానికి ఇది మనుష్యులకే కాదు – పశు పక్ష్యాదులకీ వర్తిస్తుంది. కాకి కన్నా చిలక అందంగా కనిపించడానికి కారణం కాకిలోని విరాగ దృష్టి చిలకలో లేక పోవడమే. ఆ విధంగా చూస్తే ఈ అమ్మాయి కళ్ళల్లో భావం నాకు అర్థం కావడం లేదు".

"అవును, నాకూ అట్లాగే అనిపించింది" అన్నది విద్యాలక్ష్మి.

"ఈ అమ్మాయి కళ్ళలో వైరాగ్యం ఉన్నది. మనలో ఎటువంటి భావోద్వేగాలు కలిగించని, మనల్ని అల్లంత దూరంలో నిలబెట్టే బూడిదరంగు ఎక్స్‌ప్రెషన్ ఉన్నది" అన్నాను.

ఆ మాటకి విద్య కొంత బాధ పడింది. కాని నాతో ఏకీభవించింది.

"ఇప్పుడూ – సికిందరాబాద్ స్టేషన్‌లోనూ, రాత్రిపూట ఆ ఎలిఫెంటా బ్రిడ్జి దగ్గర డ్రగ్ అడక్ట్‌లు, పిచ్చివాళ్ళు కనబడతారు. వాళ్ళ మొహాల్లోనే ఇటువంటి నిశ్చలత్వం నేను చూసాను. జీవితంలో చాలా కష్టాలు అనుభవించి, రాటుదేలి ఒక స్థాణువులా తయారైన వ్యక్తిత్వం లాగా ఉన్నదీ అమ్మాయి.

ఈ విరాగ దృష్టి ఈ వయస్సు పిల్లల్లో నేనెక్కడా చూడలేదు" అన్నాను.

"క్లాస్‌లో ఎలా ఉంటుంది;?" అన్నది విద్య.

"పైకి నార్మల్‌గానే ఉంటుంది. శ్రద్ధగా పాఠం వింటుంది. ప్రశ్నలడిగితే సమాధానం చెబుతుంది. తెలివైనదే. కాని వయసుకి మించిన గాంభీర్యం ఉందనిపించింది. చుడీదార్ వేసుకున్న సన్యాసినిలా ఉంది" అన్నాను నవ్వుతూ.

విద్య అవునన్నట్లుగా తల ఊపింది గబగబా "నాకూ అదే అనిపించింది" అంటూ.

ఆ వయసులో విద్య ఎంతో సంతోషంగా ఉండేది. అదేమిటో ఈ అమ్మాయిలో సంతోషమే లేదు.

ఎటువంటి విద్యకు ఎటువంటి కూతురని నేను ఆశ్చర్యపోయాను. విద్యలో లాలిత్యం, విలాసం ఉండేవి. ఒక కదిలే రాజవైభవంలా ఉండేది. ఈ అమ్మాయి శారదా చంద్రిక – నడక మిలటరీ మార్చ్ పాస్ట్‌లా ఉంటుంది.

చూపులు ఎదుటి వ్యక్తి మనుసులోతుల్ని కొలిచే మీటర్‌లా ఉంటాయి. అంటే ఇంటలిజన్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళలాగా చూస్తుంది. అసలా అమ్మాయికి మనుష్యులపై నమ్మకమే తక్కువనుకుంటాను. ఆ అమ్మాయి నవ్వితే తన మనసులో ఏముందో బయటికి తెలియకుండా ఒక పరదా వేసుకున్నట్టు ఉంటుంది.

అసలా అమ్మాయి ఒక గాజుబొమ్మలా పారదర్శకంగా ఉంటుంది. వీటన్నింటి వల్లా ఆ అమ్మాయిలో స్త్రీత్వం, సారళ్యం మరుగున పడిపోయాయి.

ఆ అమ్మాయిలో బాగా తక్కువైనది తెలుగుతనం.

బహుశా జీవితోత్సాహం తక్కువగా ఉండేదనుకుంటాను.

ఆ అమ్మాయి అగాథం వంటి మనిషనిపించింది. ఆ అమ్మాయిలో జాలి, దయ ఉన్నాయి కాని ఎమోషనల్ వీక్‌నెస్ మాత్రం లేదనిపించింది.

శారద అందరితో బాగా కలుపుగోలుగా ఉంటుంది. స్నేహంగా ఉంటుంది. తనలో అమాయకత్వం కూడా ఉన్నది బయటికి తెలియకుండా. స్నేహంలోనూ తనే అందరికీ ఉపయోగ పడుతుంది. లెక్చరర్స్‌తో గౌరవంగా ఉంటుంది. కాని ఎవరినీ ఒక గీత దాటి రానివ్వదు. తన వ్యక్తిగత విషయాలు ఎవరికీ చెప్పదు. ఏదో డిబేట్స్‌లో తప్ప మామూలుగా ఎక్కువ మాట్లాడదు. మితభాషి.

"పత్రికా రంగంలోకి వచ్చాక ఈ కాన్త మాట్లాడుతున్నాను" అన్నది తర్వాత ఎప్పుడో ఒకసారి.

ట్రయినింగ్‌లో ఆ అమ్మాయి ఫస్ట్ వచ్చింది.

ఆ అమ్మాయికి ఏదో మొమెంటో కూడా ఇచ్చారు.

అప్పుడు కూడా నేను ఆ అమ్మాయిలో పెద్ద సంతోషం చూడలేను. నవ్వుతూనే మొమెంటో తీసుకుంది– కాని నవ్వు సంతోషానికి సూచన కానవసరం లేదని – కొన్నిసార్లు నవ్వు మొహమాటానికి, సభా మర్యాదకీ సూచన అని నేనప్పుడు – జీవితంలో తొలిసారిగా గ్రహించాను.

ఆ తర్వాత తెలిసింది తను ఇంటర్మీడియట్ వరకు చదివింది అంతే – అని. అదీ తెలుగు మీడియంలోనే. కాని తను కష్టపడి ఇంట్లో ఇంగ్లీషు బాగా నేర్చుకుంది. తనకి రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలపై బాగా అవగాహన ఉన్నది. విలేకరులకి నిర్వహించిన వ్రాత పరీక్షలో ఆ అమ్మాయి ఇండియా మొత్తంలో ఫస్టు వచ్చింది. అందుకని డిగ్రీ లేకపోయినా ఆమెని విలేఖరిగా (స్టాఫ్ రిపోర్టర్ ట్రెయినీగా) తీసుకున్నారు.

ఆ తర్వాత ఆ అమ్మాయి కొన్నాళ్ళు ఏదో ఇంగ్లీషు పత్రికలో పని చేసి తర్వాత మా పత్రికలో చేరింది. ఉద్యోగం చేస్తూ ప్రైవేట్‌గా ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదివి బి.ఏ. పాసైంది. తర్వాత ఎం.ఏ కూడా దూర విద్య ద్వారా చదువుతోంది.

క్షణం తీరిక దొరకని విలేకరి ఉద్యోగం చేస్తూ కూడా ఆ అమ్మాయి ఎట్లాగో తీరిక చేసుకుని చదువుకునేది. రాత్రి పదింటికి ఇల్లు చేరినా, అప్పుడు స్నానం చేసి, ధ్యానం చేసుకుని నిద్ర వచ్చేదాకా – అంటే ఏ ఒంటిగంట దాకానో చదువుకుని పడుకునేదిట. ఆ అమ్మాయి ఆఫీసుకి కూడా టెక్స్ట్ బుక్ పట్టుకెళ్ళేది. లంచ్ టైంలో తీరిక చిక్కినప్పుడల్లా చదువుకునేది. ఆ అమ్మాయి దీక్ష, పట్టుదల ముచ్చటగొలిపేవని తన కొలీగ్స్ చెప్పారు.

పర్సనల్ మేనేజ్‌మెంట్ తన సబ్జక్టు.

ఆర్నెల్ల క్రితం విద్య నా దగ్గరికి వచ్చి ఒక పని చేసి పెట్టమని అడిగింది.

అదేమిటంటే ఈ అమ్మాయి శారదకి – ముప్ఫై ఒక్క సంవత్సరాలు నిండగానే ఏదో ఆస్తి రాబోతోంది.

అందుకని ఆ అమ్మాయిని తెచ్చుకుని తన దగ్గర ఉంచుకుని, తన తమ్ముడికి ఇచ్చి పెళ్ళి చేయాలని విద్య ఉద్దేశ్యం.

కాబట్టి నేను విద్య కూతురికి నువ్వు విద్య కూతురివి – అని చెప్పాలిట.

ఇదీ విద్య నన్నడిగింది.

సరే! తనేదో మొహమాట పడుతోందని నేను "సరే" అన్నాను.

విద్య కోరిక మేరకు నేను శారదతో మాట్లాడి విషయం చెప్పాను.

ఆ అమ్మాయి మొదట ఆశ్చర్య పోయింది. తర్వాత "అలాగా" అంది.

ఆ తర్వాత "ఇంతకాలం ఊరుకుని ఇప్పుడు నన్నెందుకు వాళ్ళు తీసుకు వెళ్ళడం – నేను ఇక్కడ బాగానే ఉన్నానుగా" అన్నది.

నేను బలవంతపెట్టిన మీదట విద్యని కలిసి మాట్లాడేందుకు అంగీకరించింది.

★★★★★★★

ఆ రోజు విద్య మీటింగ్ ఉంది – సిటీ సెంట్రల్ లైబ్రరీ హాలులో, నేనూ వెళ్ళాను.

ఇంకా అతిథులు రావాల్సి ఉంది. శారద వచ్చి మూడో వరసలో నా ప్రక్కన కూర్చుంది. ఏదో లేతరంగు కాటన్ చుడీదార్ వేసుకుంది. పొట్టి జడలో చిన్న మల్లెపూదండ పెట్టుకున్నది. ఈ మధ్య ఎందుకో పూలు పెట్టుకుంటోంది. ఇది వరలో తనకీ అలవాటు లేదు. పూర్వం ముదురు, బ్రైట్స్ కలర్స్ వేసుకునేది. ఇప్పుడు లేత రంగులు, పేస్టల్ కలర్స్ ఇష్టపడుతోంది.

అంతకు ముందు రోజే ఆ అమ్మాయిని వాళ్ళ పేరెంట్స్‌కి పరిచయం చేసాను నేను.

ఈ అమ్మాయి ఎంత మర్యాదస్తురాలో - కళ్ళల్లో భావం ఎట్లా ఉంటేనేం - అసలు భావం లేకపోతేనేం - వాళ్ళమ్మకి, వాళ్ళ నాన్నకి బహుమతులు కొనుక్కొచ్చింది. కాళ్ళకి సాష్టాంగ నమస్కారం చేసి అవి ఇచ్చింది. వాళ్ళకి బట్టలు కూడా పెట్టింది.

ఆ అమ్మాయిది ఏమంత పెద్ద జీతం కాదు. ఏడెనిమిది వేలుంటుంది. హైదరాబాద్‌లో ఎనిమిదివేలంటే ఇతర ఊళ్ళల్లో మూడు నాలుగు వేలతో సమానం. నగర జీవనంలో ఖర్చులు అట్లా ఉంటాయి కదా మరి.

అయినా అందులోనే ఇవన్నీ కొన్నది వాళ్ళకి. విద్య మాత్రం నాకు బొట్టు పెట్టి జాకెట్ బట్ట ఇచ్చింది కాని రాకరాక వచ్చిన కూతురికి ఏమీ ఇవ్వలేదు. అయినా శారద ఏమీ అనుకోలేదు. పట్టించుకోలేదు. తొమ్మిదేళ్ళుగా చూస్తున్నాను. ఆ అమ్మాయి వేష భాషలు ఏమీ మారలేదు. ఆనాటి మర్యాద, మన్నన ఎట్లాగైతే మారలేదో - లక్షల ఆస్తి వస్తోందని తెలిసినా ఆ అమ్మాయి మృదువర్తన నేటికీ చెక్కు చెదరలేదు.

అప్పట్లాగే మూడు నాలుగు వందల ఖరీదు మించని చుడీదార్ వేసుకుంది. ఎప్పుడూ కాటన్ బట్టలే వేసుకుంటుంది తను, చీరలైనా అంతే.

ఒంటి మీద చిన్నమెత్తు బంగారమూ ఉండదు. పూర్వం బ్లాక్ మెటల్ నగలు, పిచ్చిపిచ్చి ఇనపనగలు వేసుకునేది. అంటే రివాల్వర్ టాప్స్ చెవులకి, మెడలో ఒక రివాల్వర్ (బొమ్మ) వేలాడుతుంటుంది అవి వేసుకునేది. లేదా పుర్రెల బ్రేస్‌లెట్, చెవులకి కపాలాల హ్యాంగింగ్స్. మెడలో ఒక అస్థి పంజరం, లేదా డేగ, లేదా బుల్లెట్ వేసుకుని వేలికి కపాలం ఉంగరం పెట్టుకునేది. అప్పట్లో అవి ఫ్యాషన్. "కపాలాల సెట్ కొనుక్కున్నా" అని అందరికీ చూపిస్తే, అందరూ మానిపించారు కొప్పడి.

(ఆ అమ్మాయి హేతువాది పైగా)

అస్థి పంజరం కళ్ళు ఎర్రగా మెరిసే ఇంకో గొలుసు దొరికితే, పాతది పడేసి అది కొనుక్కుంది.

సరే, అది కుర్రతనం - ఈ తొమ్మిదేళ్ళల్లో కాస్త పరిణతి వచ్చింది. ఈ అమ్మాయి పొలిటికల్ కరస్పాండెంట్ అయింది. తర్వాత ఒక చిన్న ఇంగ్లీషు దిన పత్రికకి ఎడిటర్ అయింది. తర్వాత మళ్ళీ మా పత్రికలో స్పెషల్ కరస్పాండెంట్ అయింది.

చిన్న వయసులో అంతపైకి వచ్చింది కాని ఉద్యోగ హోదాకి తగిన పెద్దరికం రాలేదు తనకి. ఇంకా చందమామ, టింకిల్ చదువుకుంటూ ఉంటుంది.

ఇప్పుడేవో రోల్డ్‌గోల్డ్ గాజులు, గొలుసు వేసుకుంది. డబ్బంతా పుస్తకాలు, కేసెట్లు కొనడానికి ఖర్చుపెడుతుంది. లేకపోతే ఈ పాటికి నాలుగైదు తులాల బంగారం కొనుక్కోక పోయిందా?

అయినా తన దగ్గర దాదాపు ఎనిమిది వేల రూపాయలు పుస్తకాలున్నాయి. తన స్వార్జితం ఆ లైబ్రరీ అంతా. ఒక మూడు , నాలుగు వందల కేసెట్లు ఉన్నాయి. ఇళయరాజా, ఏ.ఆర్.రహమాన్, ఘంటసాల, హేమంత్‌కుమార్, భానుమతి, మైకేల్ జాక్సన్, బ్రిట్నీ స్పియర్స్, బ్రయాన్ ఆడమ్స్, జార్జిమైకేల్, యన్నీ, ఎమ్‌ఎస్ సుబ్బలక్ష్మి, జాన్‌హిగ్గిన్స్, జిఎన్ బాలసుబ్రహ్మణ్యన్, చెంబై వైద్యనాథన్, మంగళంపల్లి... ఇట్లా కొంటూనే ఉంటుంది.

గది సరిపోవడం లేదు కేసెట్లు పెట్టుకోవడానికి అని కూడా చెప్పింది. తెలుగు సాహిత్యంలో కొడవటిగంటి సాహిత్యం అంతా తన దగ్గరుంది. ఆయన అభిమాని తను. ఇంకా రావిశాస్త్రి, బీనాదేవి, శ్రీశ్రీ, తిలక్, ఉప్పల లక్ష్మణరావు, అడివి బాపిరాజు, యండమూరి, ఆరుద్ర, శ్రీపాద, యద్దనపూడి, ఓల్గా, యాకూబ్, శివారెడ్డి, బుచ్చిబాబు, కుప్పిలి పద్మ, స్త్రీవాద, దళితవాద పుస్తకాలు తన దగ్గర ఉన్నాయి. సాహిత్య విమర్శ, కవిత్వం అధికంగా ఉన్నాయి. చివరికి పోస్టు మోడర్నిజం మీద కూడా ఒక పుస్తకం కొన్నది.

ఇంగ్లీషులో డేల్‌కార్నీ, ఆర్‌కెనారాయణ్, నార్మన్ విన్సెంట్ పీలే, సోమర్సెట్ మామ్, ఆల్విన్ టాఫ్లర్ అనివోద్ పుస్తకాలు కొన్నది. ఇంకా బెంగాలీ అనువాదాలు - టాగోర్, శరత్, బంకిమ్ చంద్ర ఛటర్జీ, రష్యన్ అనువాదాలు చెకోవ్, డొస్టోవస్కీ పుష్కిన్‌ల రచనల తెలుగు అనువాదాలు ఉన్నాయి.

ఇంకా చాలామంది రాసిన పిహెచ్‌డి థీసిస్‌లు ఉన్నాయి. వీటిల్లో సగానికి పైగా తను చదివేసిందిట. నాలుగు ఐదు వందల పుస్తకాల దాకా ఉండవచ్చు.

డిక్షనరీలే ఐదున్నాయి. వాటిలో ఒకటి విదేశాల నుండి తెప్పించుకున్నది. ఇంగ్లీషు భాషకి సంబంధించి డజను పుస్తకాల దాకా ఉన్నాయి!! (గ్రామరు ఇడియమ్స్ గురించి!!).

పత్రికా భాషా నిఘంటువులు రెండు ఉండగా, జర్నలిజం గురించి కూడా పది పన్నెండు పుస్తకాలున్నాయి.

"ఇంటర్ ప్రెటేటివ్ రిపోర్టింగ్" గురించి అమెరికన్ పుస్తకం ఒకటి - ఐదువందల పేజీలది - ఉన్నది.

సంగీతం, చిత్రకళ గురించిన పుస్తకాలున్నాయి.

ఇంక ఆ అమ్మాయి బంగారం ఏం కొనుక్కుంటుంది? ఒక వాక్‌మన్ (పాకెట్ టేప్ రికార్డర్) కొన్నది. వెండి పట్టా గొలుసులు కొనుక్కుంది.

వాళ్ళమ్మకి (పెంచిన తల్లికి) చాలా చీరెలు, ఒక జత వెండి పట్టా గొలుసులు కొనిపెట్టిందిట. కజిన్స్‌కి పెళ్ళిళ్ళకి, అక్కరలకు వెండితో చేసిన వస్తువులు బహుమతులుగా ఇచ్చేది. వెండి కుంకుమ భరిణలు, పట్టా గొలుసులు, వెండి లాకెట్‌లు, వెండి గిన్నెలు ఇట్లా ఇస్తుండేది సందర్భాన్ని బట్టి.

ఎలాగూ సన్యాసి మనస్తత్వం కాబట్టి ఆ అమ్మాయికి బంగారం లేదన్న చింతా లేదు.

ఎప్పుడు చూసినా ఆ అమ్మాయి వేషధారణ బీదరికం ఉట్టిపడుతూ ఉంటుంది. ఈ తొమ్మిదేళ్ళలో తను మార్చింది బండి ఒక్కటే. మోపెడ్ మానేసి కైనెటిక్ హోండా కొనుక్కున్నది.

నేను ఇదంతా గుర్తు చేసుకుంటూ ఉండగా విద్య అక్కడికి వచ్చింది దర్జాగా గద్వాల్ చీర కట్టుకుని, బంగారం గొలుసున్న గడియారం, రవ్వల దుద్దులు, మెడలో రెండు, మూడు సన్నటి గొలుసులు వేసుకుని.

వస్తూనే వెళ్ళి ముందు వరసలో వారిని పలకరించింది. తర్వాత నన్ను చూసి మూడో వరసలోకి వచ్చింది. నాతో చేయి కలుపుతూనే ప్రక్కనే ఉన్న తన కూతుర్ని చూసి మొహం చిట్లించింది. విద్యని చూసి చిరునవ్వు నవ్వబోయిన శారద చంద్రిక పెదవులు ముకుళించుకున్నాయి.

శారదని తీక్షణంగా చూస్తూ అడిగింది డా. విద్యాలక్ష్మి - "నువ్వు ఎం.ఏ పాసయ్యావా?" అని.

శారద "ఇంకా రిజల్ట్స్ రాలేదు. పరీక్ష రాసాను" అని సమాధానం చెప్పింది.

"మరి మూడో వరుసలో కూర్చున్నావేం? వెనక్కి వెళ్ళు, కనీసం ఒక్క ఎం.ఏ అయినా పాస్ కాని వాళ్ళు వెనక కూర్చోవాలి" అన్నది విద్య.

నేను వారిస్తున్నా వినకుండా శారద వెంటనే లేచి వెనక వరసలోకి వెళ్ళి పోయింది. తను మామూలుగా ఏ సభలో అయినా చివరి వరసలోనో, గేటుకి దగ్గరగానో కూర్చుంటుంది - బోరు కొడితే వెళ్ళి పోవడానికి వీలుకోసమని (తను రిపోర్టింగ్‌కి వెళితే తప్ప).

నాకు బాధ కలిగింది.

"అదేమిటి విద్యా!" అన్నాను మందలింపుగా.

"దాని తాహతేమిటో దానికి తెలియాలిగా" అన్నది డా. విద్యాలక్ష్మి చివర్లో కూర్చున్న కూతురి వంక నిరసనగా చూస్తూ.

"ఎంత సంపాదించినా దీని బ్రతుకు ఇంతే. సంపాదన అంతా ఏం చేస్తుందో తెలియదు. కాస్త మంచి బట్టలు కొనుక్కోవచ్చు కదా - ఆ కాటన్ డ్రస్సులు వేసుకు రాకపోతే. ఇది నా కూతురని అందరికీ ఎట్లా పరిచయం చేయాలో అర్థం కాకుండా ఉంది. ఒక చదువూ, చట్టుబండలూ లేవు, శుద్ధ మొద్దు" అన్నది విద్య కోపం, చిరాకు, నిరసన, అసహనం, విసుగు అన్నీ ప్రదర్శిస్తూ.

నేను తెల్లబోయాను.

విద్యలో ఇన్నేళ్ళ పరిచయంలో నేనెన్నడూ గమనించని కోణం ఇది.

ఎంతో చదువుకుని, రచయితగా, కాలమిస్ట్‌గా పేరున్న విద్య కూతురి గురించి ఇట్లా నిరసనగా మాట్లాడడం నాకు కొంచెం బాధ కలిగించింది.

సరే, నేనేమన్నా తను వినదని ఊరుకున్నాను.

ఇంతలో ఆర్గనైజర్స్ వచ్చి, విద్యని పిలిచి ముందు వరుసలో కూర్చోబెట్టారు.

ఎప్పట్లాగే విద్య కూడా ఆ సభలో విపులంగా ప్రసంగించి కరతాళ ధ్వనులు అందుకున్నది.

శారద ఏమైనా బాధ పడుతోందేమో అనుకున్నాను.

కాని నన్నుచూసి చిరునవ్వు నవ్వింది. ప్రసంగం అయిపోయి మేం వెళ్తుంటే తన బండి మీద డ్రాప్ చెయ్యనా? అని విద్యని మర్యాద పూర్వకంగా అడిగింది శారద.

"అక్కర్లేదు. నేను మా కొలీగ్ బండి మీద వెళ్తాను" అన్నది విద్య నిరసన భావం ప్రదర్శిస్తూ.

నేను శారద బండి మీద వెళ్ళాను. దారిలో శారద నాతో అన్నది "నేనుండగా, నా బండి ఉండగా,

ఆయనెవరో కొలీగ్ బండి మీద ఎందుకు మేడమ్ వెళ్ళడం? అర్థం చేసుకోదు" అని. నేను మౌనంగా అర్థం చేసుకుంటూ ఉండిపోయాను.

కొన్ని విషయాలు ఎంత సున్నితంగా అర్థమవుతాయో కదా?

★★★★★★★

ఆ తర్వాత నెల రోజులకి – ఈలోగా మరి ఎట్లాగో తెలియదు ఈ శారద చంద్రికకీ, విద్యాలక్ష్మికీ ఏదో బంధుత్వం ఉన్నదని ఆనోటా, ఆనోటా పడి ప్రచారం కొనసాగింది. చివరకు అది నన్నూ, విద్యాలక్ష్మినీ కూడా చేరింది. ఇంతలో ఏదో అవార్డుల సభ వచ్చింది.

ఆ సభలో విద్యాలక్ష్మి కూడా ఒక అవార్డు తీసుకోవలసి ఉన్నది.

ఆ సభకి విద్యాలక్ష్మి యథాప్రకారం మంచి ఖరీదయిన చీర కట్టుకుని, తగిన విధంగా నగలు పెట్టుకుని వచ్చింది.

ఆ సంగతి నేను ముందే శారదకి ఫోన్‌లో చెప్పడంతో వాళ్ళ అమ్మని చూడాలనే ఉద్దేశ్యంతో శారద కూడా వచ్చింది.

ఈ పిల్ల కూడా యథాప్రకారం కాటన్ పంజాబీ డ్రెస్ వేసుకుని, మామూలుగా పెట్టుకునే గిల్టు నగలు కూడా (అవీ ఇరవై రూపాయల లోపువే కొంటుంది!) లేకుండా వచ్చింది.

సభికుల హర్షధ్వానాల మధ్య విద్యాలక్ష్మి అవార్డుని అందుకుంది.

బయటకు వచ్చింది.

శారద విద్యని అభినందించడానికి దగ్గరికి వెళ్ళింది– చిరునవ్వుతో.

అప్పుడే ఎవ్వరూ ఊహించలేనిది జరిగింది.

శారదని చూడగానే విద్య మొహం కోపంతో ఎరుపెక్కింది.

మనసులోంచి ఆవేశం బయటికి వచ్చింది. శారద తనకి దగ్గరగా వచ్చి కంగ్రాచ్యులేషన్స్ అనబోతుండగానే ఈడ్చి బలంగా శారద చెంప పగలకొట్టింది.

చుట్టుప్రక్కల వాళ్ళు తిరిగి చూసేంత శబ్దమైంది ఆ దెబ్బకి. శారద ఒక చేత్తో చెంప పట్టుకుని, నివ్వెరపోయి, చూస్తూ నిలబడింది దిగ్భ్రాంతిగా.

చూపుడు వేలు చూపిస్తూ బెదిరిస్తూ అన్నది విద్య.

"తగుదునమ్మా అని ప్రతి చోటికీ తయారవుతావు. ఎవరు రమ్మన్నారు నిన్నిక్కడికి? ఎందుకొచ్చావు? ఇంకెప్పుడూ మా యూనివర్సిటీకి రావద్దు. ఈ క్యాంపస్‌లో కనిపించావంటే కాళ్ళు విరిచి పొయ్యిలో పెడతాను జాగ్రత్త".

శారద షాక్ నుండి తేరుకోకుండానే, సరే అని తల ఊపి వెనక్కి తిరిగి వచ్చేసింది. ఏదో చెప్పబోయింది కాని విద్య "గెటవుట్" అనడంతో ఏమీ మాట్లాడకుండా తల దించుకుని వెనక్కి వచ్చేసింది.

నాకింక విద్యాలక్ష్మిని విష్ చేయాలనిపించలేదు. నేనూ శారదతోనే వచ్చేసాను. దారిలో శారద నాతో చెప్పింది. తను ఎం.ఏ. పాసైందిట. ఆ సంగతి చెపుదామని వచ్చిందిట. అవార్డు వచ్చినందుకు శుభాకాంక్షలు చెప్పబోతే "నీ బోడి విషెస్ ఎవరికీ అవసరం లేదు" అన్నదిట విద్యాలక్ష్మి.

★★★★★★★

నాల్రోజుల తర్వాత శారద చంద్రిక మా ఇంటికి వచ్చింది స్వీట్ బాక్స్ తీసుకుని తనెప్పుడూ బెంగాలీ స్వీట్స్ తెస్తుంది. తనకి అవి ఇష్టంట!! (తన తల్లి బెంగాలీ అని తెలియకముందే). ఆ రోజూ అలాగే రసగుల్లా టిన్, సందేశ్, చంద్రకళ, చంపాకల్లీ, లవంగలతాలు తెచ్చింది.

"ఏమిటి విశేషం?" అన్నాను స్వీట్ తీసుకుంటూ,

తనకి ఎం.ఏలో గోల్డ్ మెడల్ వచ్చిందట.

"మీ అమ్మకి చెప్పావా?" అనడిగాను స్వీటు తీసుకుంటూ. ఆ అమ్మాయి ఒక చిరునవ్వు నవ్వింది.

అమాయకత్వం, స్నేహభావం, స్వచ్ఛత, కాస్త విచారం కలగలసిన నవ్వు అది.

"వెళ్ళాను మేడమ్. ఆవిడ నన్ను బాగా తిట్టింది. నేను బాగా చదువుకోలేదట. ఎవరైనా నువ్వేం చదివావు – అని అడిగితే ఏం చెప్పాలి – అన్నది. నేను ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, దూరవిద్య ద్వారా ఏం.ఏ చదివానని చెప్పడానికి చిన్నతనంగా ఉందిట. నాకు ఏ కళలోను ప్రవేశం లేదు అన్నది. తన కూతురంటే అందరూ తనలాగే చదువుల సరస్వతి, లలిత కళా ప్రవీణ అనుకుంటారట. నిన్నెలా నలుగురికీ పరిచయం చేయాలి".

"బెంగాలీలో మాదెంత పేరున్న కుటుంబం. ఆంధ్రలో మీ నాన్నగారిది ఎంత పేరున్న కుటుంబం. మా రెండు వంశాలకీ కళంకం నువ్వు. అప్రతిష్ఠవి. నా కడుపున చెడబుట్టావే నువ్వు – అన్నది" అంటూ జరిగినదంతా చెప్పింది శారద చంద్రిక.

నేను ఆశ్చర్యంగా, విచారంగా వింటూ ఉండిపోయాను.

శారద ఇంకా చెబుతోంది "తమ కుటుంబంలో అంతా చాలా గొప్పవారుట. వాళ్ళ తాతగారు గవర్నరుగా పని చేసారట. అప్పుడే వారికి కారుండేదిట.తన భర్త తాతగారు కూడా జాతీయ రాజకీయ నాయకుడట. వాళ్ళకీ ఆ రోజుల్లోనే కారుండేదిట. విజయవాడలో మీకు కారుందా – అని వెక్కిరించింది. వాళ్ళ అక్కయ్య ఉమన్ ఏక్టివిస్ట్ అట. ఆవిడ మహిళల కోసం ఒక సంస్థ నడుపుతోందిట. వాళ్ళ అన్నయ్య, వాళ్ళ బావగారు హైకోర్టు ఎడ్వొకేట్లట. బలహీన వర్గాల కోసం కృషి చేసారుట. వాళ్ళ వదిన జర్నలిస్టుట. ఆవిడ స్త్రీల హక్కుల కోసం కృషి చేసిందిట. మేమంతా సమాజానికి ఎంత సేవ చేసాం – చేస్తున్నాం – మీరేం చేసారు? మీ అమ్మా, నాన్నా, నువ్వూ – విజయవాడలో మీ తాతగారు వాళ్ళు – అన్నది".

నేను నవ్వాను – "ఊరికే ఏడిపించడానికి అని ఉంటుందిలే" అన్నాను.

"పోనీ అలాగే అనుకోండి. ఇంకో విషయం. నేను వ్రాసిన కథలు, కవితలు, వ్యాసాలు చూసింది. ఇదివరలో బావున్నాయి అన్నది. మొన్న వాళ్ళింటికి వెడితే సీవీ అని పేరుతో తెలుగు, ఇంగ్లీషు, సంస్కృత సాహిత్యాల గురించి ఒక కాలమ్ వస్తోంది. ఫలానా పత్రికల్లో చూసావా? అని అడిగింది. ఆ నాకు తెలుసు. ఆ కాలమ్ పేరు శేషాలిక, కదా, చదువుతుంటాను. బావుంటుంది" అన్నాను.

ఆ కాలమ్ తనే రాస్తోందిట – ఆ సీవీకి ఘోస్ట్‌గా అసలు సీవీ అంటే నేనే. వీ అంటే విద్యాలక్ష్మి.

సీ మీ నాన్నగారి ఇంటిపేరు. అందుకని అలా పొడి అక్షరాలలో పెన్‌నేమ్ పెట్టుకుని రాస్తుంటాను.

నేను సీవీ పేరిట రాసిన విమర్శలు, వ్యాసాలు, పుస్తక సమీక్షలు కథలు, కవిత్వం అన్నీ అతనికి ఎంతో పేరు తెచ్చి పెట్టాయి. అసలు ఇరవయ్యో శతాబ్దిలో సీవీ వంటి మేధావి లేదని అతను పేరు తెచ్చుకున్నాడు. ఆ పేరంతా నాదే కదా! నీకేం తెలుసు అసలు, నువ్వేం చదివావు, సీవీ తన కాలమ్స్‌లో ప్రస్తావించే రచయితలు, మేధావుల పేరైనా విన్నావా? సీవీ తన కాలమ్‌లో కోట్ చేసే వారిని ఎవరినైనా ఒక్కరినైనా చదివేవా?

"పేర్లు అయినా తెలుసా నీకు? తెలిసిందానే ఎంత చదువుకున్నానో? ఎంత అధ్యయనం చేశానో?" అన్నది. పైగా నీ కథలు, వ్యాసాలు, కవితలు సీవీ రచనలతో పోల్చుకో. అప్పుడు తెలుస్తుంది నీ స్థాయి, స్థానం ఏమిటో అన్నది" అంటూ చెప్పింది శారద.

ఇదంతా ఆమె ఫిర్యాదు చేస్తున్నట్లుగానో, బాధగానో అవమానంగానో చెప్పలేదు.

ఒక సమాచారం మరో వ్యక్తితో – కాస్త దగ్గర వాళ్ళతో పంచుకుంటున్నట్టు చెప్పింది.

ఆమె కాస్త కూడా ప్రతిస్పందించక పోవడం, కోపం రాకపోవడం నాకు ఆశ్చర్యం వేసింది.

"వాళ్ళ ఇల్లు చూశారా మేడమ్. ఆవిడకి ఎన్ని అవార్డులు వచ్చాయో. నాకు చూపించింది. డ్రాయింగ్ రూం సరిపోక డైనింగ్ రూం, కిచెన్‌లో కూడా

## గజల్

నీకంటె ముందుగ నీ కీర్తి అడుగువేయాలి
నీవే ఒక వెన్నెలవై చీకటి చిదిమేయాలి

పుట్టటమే గొప్పయితే పురుగూ పుడుతుంది
ప్రొద్దు గుబాళించేలా పుస్తకమై పూయాలి

చిలకెందుకు శిశిరంలో వాలిందో తెలుసా
చెదిరిన హరితాలు మరల మ్రోడుపైని కూయాలి

కొండ అడ్డుగా ఉన్నా పొంగే నది వంగదు
ఎండిన గొంతుకలను తడిపి దప్పిక తరిమేయాలి

ప్రసవించే తల్లి కదా అరిచే ఆ మేఘం
పచ్చని పాపాయి కొరకు తీపి బాధ మోయాలి

కలమే నీ జెండా! అది ఎగరాలోయ్ రసరాజు
కాలానికి నిలిచేలా మనిషిబొమ్మ గీయాలి

–రసరాజు

పెట్టుకున్నారు. అవార్డులు, మొమెంటోలు.

ఆవిడ ఇంగ్లాండ్ వెళ్ళి వచ్చిందిట – అమెరికా, రష్యా కూడా వెళ్ళి వచ్చిందిట. ఆటా, తానా వాళ్ళు ఇచ్చిన అవార్డులు ఎన్నో వచ్చాయట ఆవిడకి. మద్రాస్ తెలుగు అకాడమీ అవార్డు, ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం, ఇంకా ఏవేవో తెలియని అవార్డులన్నీ ఆవిడకే వచ్చాయి.

అవన్నీ చూపించి చూశావా, నేనెంత సాధించానో అన్నది, ఆవిడ లైబ్రరీ చూస్తే కళ్ళు తిరిగాయనుకోండి. అన్ని పుస్తకాలు ఉన్నాయి. ఆవిడకి ఒక ప్రత్యేకమైన స్టడీ ఉన్నది. ఆవిడ కొన్ని వందల సెమినార్లలో పాల్గొని పేపర్లు చదివిందిట.

అవన్నీ కలిపి పుస్తకాలుగా ప్రచురిద్దామనుకుంటోందిట. వాళ్ళ బంగళా, కారు అన్నీ చూపించింది.

చూశావా నువ్వు ఎటువంటి ఇంట్లో పుట్టావో? ఈ ఇంటి ప్రతిష్ఠకి తగ్గట్లుగా ఉన్నదా నీ విద్యార్హత, నీ హోదా – నీ వేషధారణ అన్నది. లేదు అని చెప్పివచ్చేశాను" అన్నది శారద.

కాస్సేపు ఇద్దరి మధ్య మౌనం.

దూరంగా ఏదో పక్షి శ్రావ్యంగా ఉండి, ఉండి కూత పెడుతోంది. మధ్యాహ్నపు ఒంటరి నిశ్శబ్దం ఆ గదిలో రాజ్యమేలుతోంది.

కొంచెం సేపు ఆగి నేను అడిగాను "అవును శారదా! నువ్వెందుకు చదువు కోలేదు. కాలేజ్‌లో?"

శారద ఒక్కక్షణం మౌనంగా ఉండిపోయింది. తర్వాత చెప్పసాగింది.

"మీ స్నేహితురాలు నన్ను కని అనాథ శరణాలయంలో వదిలేసింది. ఆ తర్వాత ఆ ఊళ్ళోనే ఉన్న భాస్కరరావు గారి బంధువులు నన్ను పెంచుకున్నారు. నన్ను పెంచిన తల్లి కొన్నాళ్ళు బాగానే చూసినా తర్వాత చాలా హింసపెట్టింది. నేను సరైన ఆలనా పాలనా లేకుండా కష్టపడుతూ పెరిగాను. మా అమ్మ ఇష్టమైనప్పుడు అన్నం పెట్టేది. లేకపోతే లేదు. ఊరికే కొట్టేది. తిట్టేది. ఈ అనాధని పెంచాల్సి వస్తోంది. నువ్వు అనాధవి నీకు మేమెందుకు ఖర్చు పెట్టాలి. తిండి పెట్టాలి అని తిట్టేది. అట్ల కాడతో కాల్చి వాతలు పెట్టేది. ఇంట్లో పనులన్నీ చేయించేది.

సెకండ్ హ్యాండ్ బుక్స్ కొనిచ్చేది. వద్దంటే వినకుండా సెకండ్ హ్యాండ్ బట్టలు కూడా రెండు మూడు సార్లు బలవంతంగా వేయించింది. స్కూలు యూనిఫారం కూడా కుట్టించే వారు కాదు. ఒక్కోసారి ఒక్క జత బట్టలే ఉండేవి. అట్లా ఇంటరు దాకా ఎయిడెడ్ స్కూల్లో, ప్రభుత్వ కాలేజీలో చదువుకున్నాను – ఎక్కువ ఫీజ్ లేకుండా. మా అమ్మ ఆ తర్వాత "మేం ఇంక చదివించలేం, ఇంటరు దాకా చదివించాం కదా, ఇంక ఏదైనా ఉద్యోగం చేసుకో, నీ పొట్ట నువ్వు పోషించుకో" అన్నది.

నేను ఐటిఐలో చేరి రేడియో, టీవీ రిపేరు నేర్చుకుంటానన్నా, టైప్ రైటింగ్ నేర్చుకుంటానన్నా, సంగీతం కాలేజ్‌లో సీటు వచ్చినా వద్దన్నది. నేను గ్రామీణ బ్యాంకు పరీక్ష రాసాను. క్లర్క్‌గా సెలక్టయ్యాను. కాని వయస్సు తక్కువైంది. పోలీసు కానిస్టేబుల్‌గా చేరుదామన్నా అంతే అయింది. నేను ఇంటర్‌లో ఉన్నప్పటి నుండే కథలు అవీ రాసేదాన్ని. ఆ తర్వాత రేడియోకి ఫ్రీలాన్సర్‌గా చర్చా కార్యక్రమాలు, టాక్‌లు చేస్తుండే దాన్ని. ఆ విధంగా జర్నలిజంలోకి నేను ప్రవేశించాను. ఆ తర్వాత విజయవాడలో ఒక పత్రికలో కంట్రిబ్యూటర్‌గా పనిచేసి, తర్వాత హైదరాబాద్ వచ్చాను" అని చెప్పింది.

శారద ఇంకా ఇట్లా చెప్పింది.

"మేడమ్. మీ స్నేహితురాలు మహాపాండిత్యం ఉన్న మనిషి. కాదని ఎవరూ అనలేదు. ఆవిడకి మహామహోపాధ్యాయ బిరుదు కూడా వచ్చి ఉండవచ్చు. కాని ఆవిడ జీవితం వడ్డించిన విస్తరి. ఆవిడ నా వలె ప్రతికూల పరిస్థితుల్లో చదువు కోలేదు. నేను ఉద్యోగం చేస్తూ ఎంఏ చదివేను. నా కష్టార్జితంతో పాఠ్య పుస్తకాలు కొనుక్కుని, పరీక్ష ఫీజులు కట్టుకుని చదువుకున్నాను.

ఆవిడకి మూడు ఎం.ఏలు, డాక్టరేట్‌లు ఉండవచ్చు. ఇతర అవార్డులు వచ్చి ఉండవచ్చు. కాని నా ఒక్క పీజీ, ఒక్క గోల్డు మెడల్ నాకు అంత విలువైనవే.

నేను ఆవిడ దగ్గరికి వెళ్ళాను. వాళ్ళతో నేను ఉండలేను. ఇప్పుడు తక్షణం అందగత్తెగా మారమంటే ఎట్లా? ఆవిడంత ఆకర్షణీయంగా నేను పుట్టక పోవడం నా తప్పు కాదు.

ఆవిడ ప్రేమకి ఎన్నో పరిమితులున్నాయి. ఎన్నో షరతులు ఉన్నాయి. ఎన్నో నియమాలకి లోబడి ఆవిడ నన్ను ప్రేమగా చూస్తుంది.

నేను అందంగా, సన్నగా, యంగ్‌గా ఉండాలి, లలిత కళలు రావాలి, ఎన్నో డిగ్రీలు సంపాదించాలి – ఈ కండిషన్స్ అన్నీ సఫలమవుతే కాని ఆవిడ నన్ను కూతురుగా అంగీకరించి, తన సమాజానికి పరిచయం చేయలేదు. తను కూడా గుర్తించలేదు. నా వస్త్రధారణ నుండి ప్రతీదీ ఆవిడకి చులకనే లోకువే.

ఆవిడ మాతృత్వానికి అన్ని పరిమితులు ఉన్నాయి.

అంత కండిషనల్ మదర్‌హుడ్ నాకు వద్దు.

ఐయామ్ ఫైన్ దవే ఐయామ్. నా జీవితం నాకు సంతృప్తిగానే ఉన్నది. సంతోషంగానే ఉన్నది. నేను ఆవిడ దగ్గరికి వెళ్ళి కొత్త చిక్కులు తెచ్చుకోలేను" అన్నది శారద స్థిరంగా.

ఆమె ఇంకా అన్నది "ఆవిడకి చదువు ఉండవచ్చు. కాని ఉన్నత విలువల గురించి అవగాహన లేదు. ఉంటే చేనేత, నూలు బట్టల గురించి అట్లా చులనకగా మాట్లాడదు. కాటన్ కొని చేనేత కార్మికులని ప్రోత్సహించి వారి జీవనోపాధికి దోహదం చేయాలన్నది నా సూత్రం.

గాంధీజీ ఖాదీ ఉద్యమంతో స్వాతంత్ర్యమే తేలేదా? నూలు అంటే అంత చిన్నచూపెందుకు?

మీరెంత చదువుకున్నా, తక్కువ చదువుకున్న వారిని అసలు అక్షరాస్యులే కాని వారిని కూడా గౌరవించాలి. ఎందుకంటే సృష్టిలో దేవుడు ప్రతివారినీ ఏదో పని కోసమే కదా సృజించేది? విద్య ఒక్కటే జీవన విలువ కాదు. ఏమీ చదువుకోని వారిలో కూడా ఎంతో జీవితానుభవం, పరిణతి, లోకజ్ఞానం, జ్ఞానం ఉంటాయి. ఆవిడకి ఆ విధంగా మానవుల విలువ గ్రహించే సంస్కారం లేదు. ఒక గింజని నేల మీదికి విసిరితే అది ఎట్లా ఎగిరి పడుతుందో ఆవిడకి అటువంటి స్వభావం ఉన్నది.

నవరత్నాల కన్నా రుద్రాక్షమాల గొప్పదని గ్రహించలేని మనిషికి ఎంత చదువుండి ఏం ప్రయోజనం? చదువు, గ్రంథ పఠనం వల్ల ఆవిడ ఏం నేర్చుకున్నది?" అన్నది శారద ఆవేశం లేకుండా, మంద్రస్థాయిలో. నేను అర్థం చేసుకున్నాను.

నాకు అర్థం అయింది ఇదే కాదు – ఆ బూడిద రంగు ఎక్స్‌ప్రెషన్ – అదీ నాకిప్పుడు అర్థం అయింది. ఆ అమ్మాయి కళ్ళలో భావం ఘనీభవించిన దుఃఖం – లోకం చూసిన పరిణతి – విలువలు తెలిసిన జ్ఞానం – ఇదీ ఆ భావానికి అర్థం.

ఆత్మ విశ్వాసం –పట్టుదల. ఇది ఆ అమ్మాయి చూపులకి అర్థం.

శారద కిటికీ దగ్గరగా కూర్చుంది. దక్షిణం వేపు కిటికీలోంచి గాలి మెల్లగా వస్తోంది. ఆ చిరుగాలికి గదిలో వేలాడదీసిన విండ్ షైమ్ ఊగుతోంది. చిరుగంటలు మృదు ధ్వని చేస్తున్నాయి.

కిటికీలో మనీ ప్లాంట్ ఊగుతోంది గాలికి.

శారద క్రీం కలర్ చుడీదార్‌పైన వేసుకొన్న లేత నీలం ఓణీ గాలికి ఎగురుతోంది. శారద ఓణీ సర్దుకుంటూ కిటికీ బయట కుండీల్లో ఉన్న గులాబీ, లిల్లీ మొక్కలని చూస్తూ చెప్పింది మృదువుగా, కాని స్థిరంగా "నేను ఇంతకాలం పెద్దగా ప్రేమలు లేకుండానే పెరిగాను. ఇక మీదట అంతే. ఈ భవ బంధాల్లో చిక్కుపడడం నాకు అయిష్టం. ఆవిడ తెచ్చే పెళ్ళి సంబంధం నేను చేసుకోనని చెప్పేశాను.

నేను డా. విద్యాలక్ష్మి కూతురిగా గుర్తింపు పొందడం కంటే నేను విలేకరి శారదగా గుర్తింపు పొందడమే నాకు ఇష్టం".

నేను ఏమీ అనలేదు. అనవలసినదేమీ లేదనిపించింది. కొన్ని విషయాలు ఎంత సున్నితంగా ఉంటాయో, అంత కన్నా సున్నితంగా మనకి అర్థం అవుతాయి.

పొద్దు తిరుగుడు పువ్వు ఎప్పుడూ సూర్యుడి వేపే చూసినట్లు విద్యాలక్ష్మి ఎల్లప్పుడూ ప్రతిభనూ, విజయాలను సౌందర్యాన్నే చూస్తుంది. ఇంకా అటువంటి విలువలనే చూస్తుంది. అది ఆమె స్వభావం. ఆ స్వభావం ఆమె మాతృత్వాన్ని కూడా అధిగమించింది.

అదేమంత మంచి లక్షణం కాదనుకుంటాను.

ఓటమి, చీకటి కూడా కొన్నిసార్లు విలువలే.

ఎందుకంటే చీకటే లేకపోతే వెలుగు విలువ గ్రహించలేం. ఒక్కసారైనా ఓటమి చవిచూడకపోతే జీవితం, సమాజం సమగ్రంగా అర్థం కావు.

పల్లమే లేకపోతే ఎత్తుకి విలువ ఏది?

చాలా కొండలున్న చోటికి వెళితే కాని మైదానం విలువ, ఎడారి చూస్తే కాని అరణ్యం విలువ తెలియవు. ఇవి తెలియాలంటే జీవితాన్ని త్రాసులా గ్రహించాలి. ఒక పక్షికి రెక్కల్లేని పిల్ల పుడితే గూట్లోంచి తోసేస్తుందా? అన్నదే ప్రశ్న.

అదొక్కటే మిగిలి ఉన్న ప్రశ్న. ▲